కథ

# అదీ సంగతి

– వలివేటి నాగచంద్రావతి

అత్తవారింట్లో తొలి అడుగు వేసిన్నాడే 'చూడమ్మాయ్ సుదా, పెరట్లోకి వెళ్ళినప్పుడు పొరపాటున వెనకింటి వైపు చూస్తావేమో- వద్దు సుమా!' అన్న హెచ్చరిక జారీ చేశారు మా అత్తగారు - దాని ప్రాధాన్యతని సూచిస్తూ కళ్ళు పెద్దవి చేసి.

రాజకుమారుణ్ణి తూర్పువైపు గదికి మాత్రం వెళ్ళవద్దంటే బుద్ధి అటువైపే పరిగెత్తినట్టు- వెంటనే ఏదో పని పెట్టుకుని పెరట్లోకి వెళ్ళి తల ఎత్తీఎత్తనట్టు, ఎత్తి చూసీచూడనట్టు వెనకింటి వైపు చూశాను.

ఈ పేటలో ఇళ్ళన్నిటికీ చుట్టూరా ఖాళీ స్థలాలు బాగానే ఉన్నట్టున్నాయ్. పెద్దవి కాదుగానీ చిన్నచిన్న చెట్లూ, పాదులూ మధ్యన ఆ ఇల్లు మామూలుగానే ఉంది. కాకపోతే మా ఇంటికంటే కాస్త దిగువలో ఉంది. ఇంట్లోవాళ్ళూ మామూలుగానే ఉన్నారు. కాకపోతే ఆడవాళ్ళ తలల మీద ముసుగులూ అవీ మన ప్రాంతంవాళ్ళు కానట్టు కాస్త డిఫరెంటుగా ఉన్నారు. కొత్త శాల్తీని కాబట్టేమో ఒకళ్ళనొకళ్ళు హెచ్చరించు కుంటూ తిరిగితిరిగి చూశారు నన్ను - అంతే!

మాది కార్నర్ హౌస్. మా పక్కనున్న ఇంట్లో చిన్న ప్రయివేట్ స్కూలు నడుస్తోంది. మా అత్తగారి బాధ అదే. మా అత్తగారంటారూ 'పక్కనేమో చెవులు చిల్లులు పడేంత గోల. వెనకేమో లంకకి చుట్టాలు కాపురం. ఇరుగూ పొరుగూ అన్న సౌలభ్యం లేదు మనకి' అని వాపోయారంటే సబబే మరి.

ఆ రోజూ, మరో నాలుగురోజులదాకా మా అత్తగారికి తెలిసినవాళ్ళు కొత్త కోడల్ని కదా... నన్ను చూసి పరిచయం చేసుకు వెళ్ళారు. ఎదురుగా ఉన్న ఇంటివాళ్ళు కూడా పలకరించి వెళ్ళారు. కానీ, పొద్దున్న లేచి వంటింటి తలుపు తీస్తే ఎదురుగా కనబడే వెనకింటివాళ్ళు మాత్రం రాలేదు.

'అంత శత్రుత్వమా!?'

'నాలుగు రోజులు పోనీ అమ్మాయ్. వాళ్ళెంత జగడాలమారివాళ్ళో నీకే తెలుస్తుంది' అన్నారు మా అత్తగారు.

నాలుగు రోజులెందుకూ- రెండు రోజుల్లోనే వాళ్ళ ఆకతాయితనం చూశాన్నేను.

ఆరోజు శనివారమని మా అత్తగారు తలస్నానం చేశారా - మడిబట్ట చుట్టుకుని తులసికోట చుట్టూరా ప్రదక్షిణాలు చేస్తున్నారా- అలా చేస్తున్న ఆవిడ పక్కగా కాస్త ఎడంగానే అనుకోండీ- ఉండ చుట్టినట్టున్న పొట్లమొకటి ఎగిరొచ్చినట్టొచ్చి పడింది. పడిన విసురుకి పొట్లం మడతలు విడిపోయి రామ చంద్రా- పీకేసిన కోడి ఈకలు దూదిపింజలల్లే పైకెగిరి భూమ్యాకర్షణ వల్ల కిందపడ్డాయి.

పాపం మా అత్తగారు మళ్ళీ తలస్నానం- సణుక్కొంటూ, గొణుక్కొంటూ.


మేమేమో ప్యూర్ వెజిటేరియన్స్‌మి. రక్త మాంసాలంటిన ఈకల్నలా చూడాల్సివస్తే మాకది సహజంగానే మొహం చిట్లించుకోవాల్సిన విషయం. మా అత్తగారెలా ఊరుకోగలిగారో కానీ నాకయితే కేకేసి మరీ దులిపెయ్యాలనిపించింది. కోపంగా తలెత్తి వెనకింటి వైపు చూశాను కూడా. ఒక్కళ్ళు కనబడలేదు. ఎవరో వంగినట్టు నాకు అనుమానం.

"ఆళ్ళంతేనండి. ఉత్త ఐతర్‌నాక్ మనుషులండి. 'ఆళ్ళ పాపాన ఆళ్ళే పోతార్లే' ఆళ్ళ నోట్లో నోరెట్టి గెలవలేం' అంటారండి అమ్మగారు" చెప్పింది కనక. మా ఇంట్లో పనిచేసే పనిపిల్ల. పంపు చప్టాలో అంట్లు తోముతోందది.

'అబ్బ, ఎంత ఓరిమో' మా అత్తగారి మీద గౌరవం అలా అలా పెరిగిపోయింది నాకు.

★ ★ ★

పెళ్ళికని పెట్టిన రెండునెలల సెలవు చివరికొచ్చింది. "ఇక రేపట్నుంచీ పొద్దున వెడితే సాయంత్రమయితే గానీ రావను కుంటాను. కోడల్ని తీసుకుని భోజనానికి వచ్చివెళ్ళమని ఇప్పటికి నాలుగుసార్లు ఫోన్ చేసింది మా చెల్లెలు. ఊళ్ళోనే కదా... సాయంత్రానికల్లా వచ్చేయొచ్చును. ఈరోజు వెళదామా?" అడిగారత్తగారు.



అసలత్తగారి కంటే పిన్నత్తగార్ని మంచి చేసుకోవటం ముఖ్యమన్నారు పెద్దలు. 'తప్పకుండా' అన్నాను.

వెళ్ళాం. మా చిన్నత్తగారు స్వరాజ్యలక్ష్మి. ఆవిడ తత్వమేమిటో నాకసలు అంతుచిక్కలేదు.

ఓ పక్కనుంచి "మా నలుగురు అక్కచెల్లెళ్ళలో నీకులా పెద్ద చదువులు చదివి ఉద్యోగం చేసే కోడల్ని తెచ్చుకున్నది మా అక్క ఒక్కతే సుమా. నిన్ను చూస్తే మాకంతా ఎంత గర్వంగా ఉంటుందో" అంటూనే, ఇంకోపక్కనుంచి "ముప్పయ్యేళ్ళ నాడు మా అక్కని పెళ్ళాడి వంటలక్క పోస్టు ఇచ్చారు మా బావగారు. ఇప్పుడు ఉద్యోగం చేసే కోడలొచ్చి ఆ పోస్టుని పర్మినెంటు చేసింది" అంటూ వ్యంగ్యపు నవ్వు నవ్వింది.

పోనీ- అక్కమీద అంత సానుభూతి ఒలకబోసిన ఇల్లాలు తన ఇంట్లోనయినా అక్కగార్ని కూర్చోబెట్టి వండి వడ్డించవచ్చునా- ఊహూ. "మా అక్క మెంతి వంకాయ, మజ్జిగపులుసూ చేయటంలో ఎక్స్‌పర్ట్ తెలుసా... చూద్దాగానీ రోజు" అంటూ మా అత్తగారి చేతికి గరిట అందించేసి వంటింటికి ఇన్‌చార్జ్ చేసేసింది.

'అసాధ్యురాలే' నవ్వుకున్నాను.

భోజనాలయ్యాయి. భుక్తాయాసం తీరాలి కదా - శరీరమెటూ కదలట్లేదు కాబట్టి నోటికి ఫుల్‌గా పని చెప్పారు అత్తగార్లిద్దరూ. నేను కళ్ళు టీవీ మీద పెట్టి మధ్యమధ్య వాళ్ళ కబుర్లు వింటున్నాను.

మాటలమధ్యలో మా చిన్నత్తగారు "అక్కా మొన్న నువ్వు పంపావే..." అని ఏదో చెప్పబోయి చటుక్కున మాటలాపి నాలుక్కరుచుకున్నారు. అందుక్కారణం మా అత్తగారి కనుసైగ అని అనుమానం.

సర్లే, తోబుట్టువుల మధ్యన ఎన్నో దాపరికాలుండవచ్చు. ఏమిటీ అని ఆరా నాకేల' నేనంతగా పట్టించుకోలేదు దాన్ని.

మామగారూ, మావారూ ఇంటికొచ్చేసే టైముకి మేమూ తిరిగొచ్చేశాం. అప్పటికే కారాలూ మిరియాలూ నూరుతూ కంప్లయింట్‌తో రెడీగా ఉంది మా వత్సల. వత్సల నా ఏకైక ఆడబడుచు. హాస్టల్లో ఉండి ఎంసెట్ కోచింగ్ తీసుకుంటోంది. దాదాపు ప్రతి శనివారం ఇంటికొచ్చి సోమవారం వెళ్ళిపోతుంటుంది.

ఇంతకీ వత్సల పిర్యాదేమిటంటే- క్రితంసారి వచ్చినప్పుడు పెరట్లో చిన్న మడి తవ్వి పూల విత్తనాలేవో చల్లి వెళ్ళింది. ఓ ఫ్రెండు బెంగళూరు నుంచి తెచ్చి తనకి మాత్రమే ఇచ్చిందట- ఇంకెవరికీ ఇవ్వకుండా. 'చాలా అపురూపమైన పూలు పూస్తాయట' అని మురిసిపోతూ చెప్పింది.

ఈరోజు వచ్చిచూస్తే ఆ మడంతా కుళ్ళగించేసి ఉంది. "వెదవ కోళ్ళు... ఒళ్ళు విత్తనం లేకుండా తవ్వి తినేశాయ్" అంటూ ఏడుపుమొహం పెట్టేసింది. మా ఇంటికీ వెనకింటికీ మధ్య ఉన్న ప్రహరీగోడ చివరన కాస్త వెలితుంది. అదేదో సరిహద్దు కొలతల గొడవ. అందులోంచి వాళ్ళ కోళ్ళు మా పెరట్లోకి ఇష్టారాజ్యంగా వచ్చేస్తుంటాయ్. దర్జాగా వెళ్ళిపోతుంటాయ్. "అసలెందుకమ్మా ఊరుకుంటావ్. ఆ పాడు కోళ్ళు మన దొడ్లోకి రాగానే కాళ్ళు విరిచి వాళ్ళ పెరట్లోకి గిరవాటెయ్యక" అంటూ ఎగిరిపడింది మా వత్సల.

పాపం, మా అత్తగారు... ఆవిడకసలే భూతదయ ఎక్కువ. అవి వచ్చినప్పుడు తరిమేయటం మాట అటుంచి - నూకలో, గోధుమ రవ్వో ఏవో ఒకటి విసురుతుంటారు కూడా.

"పోన్లెద్దూ, విత్తనాలే కదా... మళ్ళా వేసుకోవచ్చులే. అయినా అయిపోయిందానికి అంత రాద్ధాంతం చేస్తావెందుకు చెప్పు. పాపం, నోరులేని జీవాలు వాటికేం తెలుస్తుంది" అంటూ వాటిని వెనకేసుకు వచ్చారు ఇప్పుడు కూడా.

ఒళ్ళు మండుకుపోయుంటుంది వత్సలకి. కావాలని పెరట్లోదాకా వెళ్ళిపోయి గొంతు పెంచేసింది. "నువ్వూరుకున్నా, నేను ఊరుకోలేనమ్మా. నీ చాదస్తం నాకు లేదు. నేనున్నప్పుడు రానీ చెబుతా- కాళ్ళు కాదు. మెడ విరిచి అవతల పారేస్తా" అంటూ గయ్యిమంది.

ఈ చర్యకి ప్రతిచర్య వెంటనే రెట్టింపుగా వెనకింట్లో నుంచి వచ్చేసింది. ఇద్దరు మధ్య వయసు ఆడవాళ్ళు తలమీది ముసుగులు మొహం మీదకి లాగేసుకుంటూ పోట్లాడుతున్నట్టుగా గట్టిగట్టిగా సమాధానమివ్వటం మొదలు పెట్టారు.

వాళ్ళు అనేవి ఒక్క ముక్కా అర్థంకావట్లేదు నాకదేమిటో. వచ్చీరాని తెలుగుకి హిందీ లాంటి మరో భాషని కలగలిపేసి మాట్లాడుతున్నారు వాళ్ళు. వాళ్ళ గోడకి కాస్త దగ్గరగా వెళ్ళి 'కాస్త అర్థమయ్యేలా చెప్పరూ దయచేసి' అని అడుగుదామనుకున్నానుగానీ ఈలోగానే మా అత్తగారు నా రెక్కా, వత్సల రెక్కా పట్టుకుని బలవంతాన లోపలికి లాక్కెళ్ళి తలుపులు వేసేశారు.

★ ★ ★

"బుద్ధుందా నీకు వత్సలా. అలగా మనిషిలాగా ఆ అరుపులేమిటి అసహ్యంగా" చెల్లెల్ని చిన్నగా మందలించారు శ్రీధర్ - నా పతిదేవుడు.

అప్పటికి వత్సల ఉద్రేకం కూడా పిసరంత చల్లబడింది. "నేనన్నది ఒక్కటే మాట. అరిచిందంతా వాళ్ళు - నన్నంటావేం?" మొహం ముడుచుకుంది వత్సల. కాస్త సిగ్గుపడినట్టుంది కూడా.

"అదివరకు ఆ ఇల్లు అద్దెకు తీసుకున్న వాళ్ళు చాలా మంచివాళ్ళు మీ అత్తగారూ, వాళ్ళూ చాలా సఖ్యతగా ఉండేవాళ్ళు. ఏడాది దాటుతోంది వీళ్ళు వచ్చి. మొదట్నుంచీ వాళ్ళకూ మనకూ పడటంలేదు ఎందుకనో. కనిపిస్తే చాలు.., చురచుర చూస్తారట. భాష ప్రాబ్లమ్ ఒకటి. అటువైపు చూడ్డానికే భయపడిపోతారు వీళ్ళు" గత చరిత్ర చెప్పారు మామగారు- కూతుర్ని సానుభూతిగా చూస్తూ.

"జాయింట్ ఫ్యామిలీ అనుకుంటా. చాలామంది ఉన్నట్టున్నారు ఇంట్లో" అన్నాన్నేను సంభాషణలో కలుస్తూ.

"ఆ...ఆ... ఉమ్మడి కుటుంబమే. ఓ గుంపు కోళ్ళూ, రెండు గేదెలూ, పాడులూ మొక్కలతో సహా మహా విశాలమైన కుటుంబం. కోళ్ళ చెత్తా, పేడ కంపూ, పురుగులూ, దోమలూ మనక్కూడా పంచిపెడుతూ... గొప్ప ఆదర్శ కుటుంబం" కసిగా అంది వత్సల.

నవ్వాన్నేను.



"నీకు తెలీదొదినా... మన దారిన మనమున్నా ఏ వెధవ పనో చేసి కవ్విస్తుంటం... ఇదేమంటే, చూశావుగా... అర్థంకాని యాసలో నోరు పారేసుకోవటం. అబ్బా, మా అమ్మ కాబట్టి అలా వాళ్ళతో వేగుతోంది గానీ... ఛీ! ఏం మనుషులో" రుసరుసలాడింది వత్సల. మాటపడని ఉడుకు రక్తం కదా. పాపం!

మా అత్తగారు టీ పెట్టి తీసుకొచ్చి ఇచ్చారు మాకందరికీ. "ఇక ఆపవే తల్లీ. లోకంలో ఎన్ని తరహాల మనుషులో. అందరితోనూ సర్దుకుపోవటం నేర్చుకోవాలి. ఇలాంటివాళ్ళని పట్టించుకోనట్టు తలొంచుకుని వచ్చేస్తే ఏ పేచీ ఉండదు" అన్నారు అత్తగారు నవ్వుచెబుతూ.

"అమ్మ మాట కరెక్ట్. ఇక టాపిక్ ఛేంజ్ చేయండి. సాయంత్రాన్నెందుకు పాడుచేస్తారు" అన్నారు శ్రీధర్ నవ్వుతూ.

మాటల్లోపడ్డాం.

"నేను వాళ్ళతో స్నేహం చెయ్యనా?" హఠాత్తుగా అడిగాను.

తెల్లబోతూ చూసి "నీవల్ల కాదులే" అంతలోనే నవ్వేశారు అత్తగారు.

"చూద్దాం" అన్నాను. కాలేజీలో మాట్లాడని వాళ్ళని కూడా పలకరించి కలుపుకుంటానని పేరు నాకు.

మర్నాటినుంచే ప్రారంభించాను నా ప్రయత్నాలు. ఉదయమే పెరట్లో వాళ్ళు కనబడ్డ వెంటనే 'గుడ్‌మార్నింగ్' చెప్పాను చెయ్యి ఊపుతూ... ఆడవాళ్ళకేనండీ బాబూ. ముందు ఆశ్చర్యంగా చూశారు. తరవాత తల తిప్పుకున్నారు. వాళ్ళకు అర్థంకాలేదేమోనని 'జై శ్రీకృష్ణ' అనీ, 'సత్‌శ్రీ అకాల్' అనీ కూడా పలకరించాను- నా టీవీ పరిజ్ఞానమంతా ఉపయోగించి. ఉహూ, స్పందనే లేదు. అలాక్కాదని ప్రహరీకి దగ్గరగా వెళ్ళి దండెం మీద చీరలు ఆరేస్తున్న ఆవిడ్ని "మీ చీర డిజైను చాలా బావుంది ఆంటీ, బహుత్ అచ్చా హై... ఎక్కడ కొన్నారు?" అని కదిపాను. "స్వీటు చేస్తున్నారా బాభీ, సువాసన గుబాళిస్తోంది" అని పొగిడాను మరోసారి. అబ్బే, మా మామగారు అన్నట్టు కొరకొరా చూశారంతే.

నా అంచనా ప్రకారం ఇంకొకళ్ళయితే ఈపాటికి కాస్తన్నా ప్రసన్నత చూపించేవారే. ఇది కాస్త మొండి కేసు. శ్రీధర్ జాలిగా చూస్తున్నారు నాకేసి. నాకు పట్టుదల పెరిగిపోయింది. 'ఏమయినా సరే, ఓటమి ఒప్పుకోను. మడమ తిప్పడం అనేమాట నా డిక్షనరీలోనే లేదు.'

మర్నాటి సాయంత్రం ఆఫీసునుంచి వస్తూ డబ్బాడు చాక్లెట్లు పట్టుకొచ్చాను.

"ఎందుకవి? దండగ పనులు" నచ్చనట్టు గొణిగారు అత్తగారు.

"పెద్దలు చెప్పిన నాలుగు ఉపాయాల్లో ఇది ఒకటి. ప్లీజ్, ఈ ఒక్కసారీ..." అర్థించాను.

డబ్బా డబ్బా తీసుకెళ్ళి సరిహద్దు గోడ మీద పెట్టాను. "ఆంటీ" అని కేకేసి, "ఈరోజు నా పుట్టినరోజు. ఇవి పిల్లలకివ్వండి" ఎంతో అభిమానం ప్రదర్శించాను.

ఈ ట్రిక్కుకి తిరుగులేదు అనుకున్నానేగానీ అదీ ఎదురు తిరిగింది. ఏమిటేమిటో అంటూ ఆవిడ తోసిన తోపుకి టప్పుమంటూ నాముందు పడిందా డబ్బా. మూత ఊడి కకావికలమయిన చాక్లెట్లు ఉసూరుమన్నాయి.

"చెప్పానా - మూర్ఖుల మనసు రంజింప చేయలేమూ అంటారు వినలేదూ" తనన్నమాట రుజువయినందుకు సంతోషపడుతూ అన్నారు అత్తగారు.

విన్నానుగానీ ఒప్పుకోను. వాళ్ళని మంచి చేసుకు తీరుతాను. కానీ, ఎలా... ఎలా..?

దొరికింది దారి. చీటీలాగా మారి, కనక చేతుల్లోంచి జారి.

ఆ చీట్లో ఏముందో తరవాత చెబుతాను.

★ ★ ★

అత్తగారు ఊరెళుతున్నారు. చిన్నత్తగారితో

కలిసి దూరపు బంధువులింట్లో ఏదో ఫంక్షను.

"రెండే రోజులు, సర్దుకోగలవుగా. మొక్కలకి నీళ్ళు కనక పోస్తుందిలే" అన్నారు అత్తగారు.

"ఏం పరవాలేదు. మీరు నిశ్చింతగా వెళ్ళిరండి అత్తయ్యా" అన్నాన్నేను.

"మీకెందుకమ్మా, చీకట్నే వచ్చేసి... చిన్నమ్మగారు ఆఫీసుకి వెళ్ళేదాకా సాయం చేసే వెడతాగా" భరోసా ఇచ్చింది కనక.

అన్నట్టుగానే సరిగ్గా రెండు రోజుల్లోనే వచ్చేశారు అత్తగారు.

ఆరోజు శనివారం. వత్సల కూడా ఇంటికి వచ్చింది. సాయంత్రం 'టీ'కి ముందు ప్లేటులో పకోడీలతోపాటు చిన్నచిన్న బౌల్స్‌లో రసగుల్లాలు పెట్టి ఇచ్చాను అందరికీ.

"ఇవెక్కడివి?" అన్నారు అత్తగారు.

"వెనక ఇంటివాళ్ళు పంపించారు. ఆ ఆంటీ పేరు లక్ష్మీబాయి అట" నా మొహంలో విజయ దరహాసం, నమ్మలేనట్టు చూస్తున్నారందరూ.

"ఎలా సాధించావ్ వదినా" విస్మయం, సంభ్రమం వత్సలకి.

నేనూ ఒక బౌల్ తీసుకుని శ్రీధర్ పక్కన సోఫాలో కూర్చున్నాను. "ఏం లేదు. చిన్న ఫేవర్ చేశానంతే. ఫ్లాటయిపోయారు" అంతా కుతూహలంగా చూస్తుండగా చెప్పాను.

"మొన్న బ్రష్ చేసుకుంటూ మొక్కల దగ్గరకి వెళితే అరటిచెట్ల దగ్గరొకటీ... గోడ వారంటా పెరిగిందే దోసపాదూ- దాని



దగ్గరొకటీ రెండు కోడిగుడ్లు కనబడ్డాయ్. వాటిని జాగ్రత్తగా కాగితంలోకి తీసి గోడమీంచి వాళ్ళకి అందించాను 'మీ కోళ్ళవే ఇవి' అని. చాక్లెట్లలా విసిరెయ్యలా. తీసుకున్నారు. మేం చూడకపోతే ఏ పిల్లో తినేస్తుంది. రోజూ మీ పిల్లవాళ్ళే పంపించండి. మా పెరట్లో చూసుకుని తీసుకువెడతాడని చెప్పాను. అది వాళ్ళకు అర్థమయ్యేలా చెప్పడానికి నేనెంత కష్టపడ్డానో మాత్రం అడక్కండి. ఆవిడ మొహం ఇంతయింది. సాయంత్రమేమో- ప్రహరీగోడ వారంటా వాళ్ళ బొప్పాయి చెట్లు రెండున్నాయి కదా... మనవైపు వాలటం మూలాన వాళ్ళకు అందటంలేదట. స్టూలు వేసుకుని ఎక్కి ఆ కాయలు కోసి వాళ్ళ గోడమీద పెట్టేశాను. ఎంత సంతోషించారో చెప్పలేను.

పొద్దున్న నేను ఆఫీసుకు వెళ్ళబోయే ముందు వంటింటి తలుపు వేయబోతూంటే 'బహూ' అని పిలిచి ఈ రసగుల్లాల గిన్నె చేతికందించింది. ఇంట్లోనే చేశారట. అదీ కథ. ఇక వాళ్ళకీ మనకీ ఏ పేచీ ఉండదు" అన్నాను ఊపిరి పీల్చుకుంటూ.

"వెరీగుడ్" అన్నాడు శ్రీధర్ రిలాక్స్‌డ్‌గా.

"నేను చేసింది బాగుందా అత్తయ్యా. వాళ్ళవి వాళ్ళు తీసుకెళితే మనకేం ఇబ్బందిలేదుగా?" అన్నాను అత్తగారికేసి చూసి.

"అబ్బే, మనకేం ఇబ్బంది" నవ్వు తెప్పించుకుంటూ లేచి వెళ్ళిపోయారు అత్తగారు.

★ ★ ★

ఇప్పుడు చెప్తాను- నాకు దొరికిన స్లిప్పులో ఏముందో. చెప్పకపోతే కథేముంది!

కనకకి జీతమిస్తూ మా అత్తగారు దానికిచ్చిన ఆ చీటీలో ఓ లెక్కుంది. అదేమిటంటే-


18 కోడిగుడ్లు - 90.00 రూ॥


5 బొప్పాయి - 100.00 రూ॥

10 జామపళ్ళు - 40.00 రూ॥

వెరసి రెండువందల ముప్ఫై రూపాయలు. జీతం వెయ్యి రూపాయల్లో అది మినహాయిస్తే మిగిలింది ఏడువందల డెబ్భై రూపాయలు. అదీ ఆ స్లిప్‌లోని సారాంశం.

మాకు కోళ్ళు లేవు. బొప్పాయి చెట్టూ, జామ చెట్టూ మావి కావు. అదీ సంగతి! అర్థమయిందనుకుంటాను. ★







# సాహసమే జీవితం!

భోజనం చేసేప్పుడు పంటికింద చిన్న రాయి తగిలితేనే కలుక్కుమంటుంది. అలాంటిది ౬౦ కిలోల బరువున్న నాగలిని ఎలాంటి ఆసరా లేకుండా పంటి బిగువున పట్టుకొని గాల్లోకి లేపి చుట్టూ తిప్పడం అంటే మాటలా. నిండు సిలిండరును వసారా నుంచి వంట గదిలో పెట్టడానికే ఆపసోపాలు పడతాం. అదే సుమారు ౧౮౦ కిలోల బరువుండే బండి చక్రాలను రెండు చేతులతో లేపి చుట్టూ తిప్పాల్సి వస్తే... సాధారణ వ్యక్తులకు సాధ్యం కాని ఇలాంటి ఎన్నో విన్యాసాలను చేస్తూ చూపరులను ఆశ్చర్యపరుస్తున్నారు అనంతపురం సరిహద్దులోని దావణగెరెకు చెందిన పహిల్వాన్లు. కర్ణాటకకు చెందిన వీళ్లు జీవనోపాధిని వెతుక్కుంటూ అనంతపురం జిల్లాకు వస్తుంటారు. అక్కడ రకరకాల విన్యాసాలను ప్రదర్శిస్తారు. హిందూపురంలో ప్రదర్శన ఇస్తున్నప్పుడు తీసిన ఫొటోలే ఇవి. ఓ మోస్తరు బరువున్న బండరాయి మీద పడితేనే గుండె ఝల్లుమంటుంది. కానీ సుమారు ఏడు వందల కిలోల బరువుండే రోలర్‌ను ఒంటిపై నుంచి పోనిచ్చుకుంటూ వీరు చేసే సాహసాన్ని చూస్తే ఒళ్లు గగుర్పాటుకు గురవడం ఖాయం. కన్నడ చిత్ర పరిశ్రమకు చెందిన కొందరు వీళ్ల విన్యాసాలను చూసి, వాటిని సినిమాల్లో కూడా వాడుకోవడం విశేషం.

తరతరాలుగా వీళ్లంతా ఇదే వృత్తిలో కొనసాగుతున్నారు. కండలు తిరిగిన దేహాలు లేకపోయినా ఎన్నో ఏళ్ల కఠిన సాధన వారి సొంతం. అందుకే సునాయసంగా ఈ విన్యాసాలు చేయగలుగుతున్నారు. 'ప్రాణాలకు ప్రమాదం కదా' అంటే 'మాకు తెలిసిన పని ఇదొక్కటే, అయినా మాకు ఇది బాగా అలవాటైపోయింది' అంటారు. సాధన చేస్తే ఏదీ అసాధ్యం కాదనడానికి వీళ్ల విన్యాసాలే ఉదాహరణ. అలాగని ఎవరు పడితే వాళ్లు ప్రయత్నిస్తే ప్రమాదాలను కొనితెచ్చుకున్నట్లే సుమా. అలాంటి ప్రయత్నాలు చేయరు కదూ..!

ఫొటోలు: ఎన్.గిరి, ఈనాడు, హిందూపురం